క్లుప్తంగా

ప్రతి ఫ్రైడే డ్రైడే పాటించాలి

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం జరపాలని ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలకు జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి వైద్యాధికారి వినోద్ కుమార్‌తో పలు విషయాలు చర్చించారు. ప్రస్తుత సీజన్‌లో వచ్చే జ్వరాల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రేఖనాయక్, దేవదానం, ఎంపీహెచ్‌ఈఓ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

సంబేపల్లి : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఏపీ వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థులు ఎక్కువగా సెల్‌ఫోన్‌లు చూడటంతో చదువు పట్ల ఏకాగ్రత కోల్పోవడంతో పాటు కంటి చూపు తగ్గుతోందని అలాంటి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ అమరేశ్వరి శుక్రవారం పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంఈఓ నాగయ్య, ఎంఈఓ అనంత కృష్ణ, కళాశాల లెక్చరర్ లక్ష్మీనారాయణ, పీడీ గౌరీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులు (10వ తరగతి) 10 మందికి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. బయోస్టడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,500ల చొప్పున అందజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరదరాజు మాట్లాడుతూ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్న బయోస్టడ్ సంస్థను అభినందించారు. కార్యక్రమంలో బయోస్టడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ మేనేజర్ జనార్దన్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ చాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నారాయణ నెల్లూరులో మెడికల్ క్యాంపు

పెనగలూరు : మండలంలోని ఆర్‌ఆర్ నెల్లూరు గ్రామంలో శుక్రవారం డాక్టర్ తౌసిఫ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో కొంతమందికి విష జ్వరాలు ఉండటంతో ఈ క్యాంపును నిర్వహించినట్లు వైద్యులు తెలియజేశారు. గ్రామంలో ఉన్న వారందరికీ రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గ్రామాలలో వైద్య సిబ్బంది ప్రజల ఇంటివద్దకు వెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. మురికినీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ చేసుకోవాలని సూచించారు.

నులిపురుగుల నివారణకు సహకరించండి


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి

నందలూరు : విద్యార్థుల్లో నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఇంతియాజ్ కోరారు. శుక్రవారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పరిధిలో ఇప్పటి వరకు 12205 విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వేశారు. అనంతరం ఆయన పలు పాఠశాలలను పరిశీలించారు. ఆయన వెంట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీలు ఆరీఫ్, హిమబిందు, సులోచన, ఏఎన్‌ఎం అమృత పాల్గొన్నారు.

వినాయక ప్రతిమల వద్ద నిబంధనలు పాటించాలి

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : ఈ నెల 27వ తేదీన వినాయక చవితి సందర్భంగా ప్రతిమలను నెలకొల్పేందుకు సిద్ధమవుతున్న కమిటీల సభ్యులు తప్పనిసరిగా ప్రభుత్వ నియమ, నిబంధనలను పాటించాలని రామాపురం ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. రామాపురంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వినాయక చవితి విగ్రహాలకు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మండపాల వద్ద రాజకీయ పార్టీల పాటలకు అనుమతులు లేవని భక్తిపాటలు మాత్రమే అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. నిమజ్జనం చేపట్టే ప్రాంతాలు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. శాంతి, భద్రతలకు విఘాతం కలిగించకుండా వేడుకలు చేసుకోవాలన్నారు.

ప్రకృతి కరుణించదు.. ప్రభుత్వం కనికరించదు!

- నానాటికీ పతనమవుతున్న ప్రజల కొనుగోలు శక్తి
- రాయచోటిలో వెలవెలబోతున్న దుకాణాలు
- పరిస్థితి ఇలానే కొనసాగితే వలసలే గతి అంటూ నిట్టూర్పు
- గత ప్రభుత్వంలో పొందిన సంక్షేమాన్ని గుర్తు చేసుకుంటున్న వైనం


జనసంచారం లేక బోసిపోతున్న రాయచోటి గాంధీబజార్

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రజల కొనుగోలు శక్తి రోజురోజుకు తగ్గుతూ వస్తోంది. రాయచోటి ప్రాంతంలో ఎక్కువగా అరుతడి పంటలపైనే ఆధారపడుతుంటారు. రెండేళ్లుగా వరుణుడి దయచూపకపోవడంతో కరువుతో ఈ ప్రాంత రైతులు విలవిలలాడిపోయారు. ఆదాయం మాట పక్కన పెడితే అప్పులు ఊబిలో కూరుకుపోయిన పరిస్థితులు అన్ని గ్రామాల్లో కనిపిస్తున్నాయి. దీంతో చేతులో పైసా లేక సామాన్యుల నుంచి మధ్య తరగతి వరకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అలానే వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కూలీలు, తోపుడు బండ్ల వ్యాపారులు గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంతమంచిది. ప్రకృతి వైపరీత్యాలకు తోడు ప్రభుత్వం నుంచి ప్రజలకు ఎటువంటి సహాయ, సహకారాలు అందకపోవడంతో సామాన్యుల కుటుంబపోషణ భారమైనట్లు తెలుస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే మళ్లీ వలసబాట పట్టక తప్పదని పలువురు పేర్కొంటున్నారు.

నిర్వీర్యమైన ఉపాధి హామీ

గ్రామీణ కూలీలకు కల్పతరువుగా ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకం ప్రస్తుతం నిర్వీర్యమైనట్లు అధికార వర్గాలే చెబుతున్నాయి. ఈ పథకం కింద పండ్ల మొక్కలు నాటుకున్న రైతులకు నెలల తరబడిగా మెటీరియల్ బిల్లులు అందడం లేదు. కూలీలకు సైతం దాదాపు కొన్ని నెలలుగా బిల్లులు అందలేదని వాపోతున్నారు.

వ్యాపారుల బేజారు

ఏడాది నుంచి అన్ని రకాల వ్యాపారాలు డీలా పడినట్లు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. నిత్యావసర సరుకులు, మందులు మినహా వస్త్ర దుకాణాలు, ఫ్యాన్సీ స్టోర్లు, బంగారు షాపులు, సిమెంట్, ఐరన్ మార్ట్‌లు ఇలా అన్ని రకాల వ్యాపారాలు పూర్తిగా తగ్గిపోయినట్లు వ్యాపార వర్గాలు ఆవేదన చెందుతున్నారు. వ్యాపారాలు లేకపోవడంతో నెల బాడుగ చెల్లించడానికి సైతం అవస్థలు పడుతున్నట్లు తెలియజేశారు. ఇంత దుర్భర పరిస్థితి ఎన్నడూ చూడలేదని వారు నిట్టూరుస్తున్నారు. ప్రజల వద్ద డబ్బు లేకపోవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు.

సంక్షేమానికి మారుపేరు వైఎస్ జగన్

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్‌ఆర్ రైతు భరోసా, జగనన్న విద్యాదీవెన, జగనన్న విద్యావసతి, వైఎస్‌ఆర్ ఆసరా, వాహనమిత్ర, వైఎస్‌ఆర్ చేయూత, నేతన్న నేస్తం, కాపు నేస్తం ఇలా ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలను కనుమరుగు చేసింది.



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు కోడి రెడ్డిభాస్కర్ రెడ్డి. గత 15 సంవత్సరాలుగా రాయచోటి బస్టాండు మార్గంలో సూర్య ఎంటర్‌ప్రైజెస్ దుకాణం ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతంలో రోజుకు రూ.8 వేల నుండి రూ.10 వేల వరకు వ్యాపారం జరిగేది. కానీ గత ఆరు నెలల నుంచి వ్యాపారం బాగా తగ్గిపోయిందని, రోజుకు వెయ్యి రూపాయల వ్యాపారం జరగడం కూడా కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దుకాణం అద్దె, కరెంటు బిల్లు నెలకు రూ.15 వేలు పైబడి కట్టాల్సి ఉందన్నారు. పెట్టుబడి పోను అరకొర మిగులుబాటుతో చేతి నుంచి అద్దె చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదనను వ్యక్తం చేశాడు.

అడిగేవారే లేరు



బంగారం ధర పెరగడంతో పాటు కరువు పరిస్థితి ఏర్పడటంతో బంగారు ఆభరణాలు కొనేవారు కరువయ్యారు. ఏమి కొనాలన్నా.. ఏం తినాలన్నా ప్రజల వద్ద డబ్బు చలామణి కావడం లేదు. ఆదాయ వనరులు పూర్తిగా తగ్గిపోయాయి. ఆ ప్రభావం వ్యాపారాలపై స్పష్టంగా కనబడుతోంది. ప్రజల వద్ద డబ్బు ఉంటే అన్ని వ్యాపారాలు జరుగుతాయి.

– షేక్ బాబ్జీ, జ్యువెలరీ షాపు యజమాని, గాంధీబజార్, రాయచోటి

పనులు లేవు



చేతిలో డబ్బులు లేకపోవడంతో ఇండ్లు కట్టడం చాలా తగ్గిపోయింది. కూలీలకు పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. సంసారాలు జరగడం కూడా కష్టంగా ఉంది. ప్రభుత్వం క్వార్టర్స్ చేసి ఉంటే పనులు దొరికేవి. ఇప్పటికే చాలా మంది కార్మికులు హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలకు వలసలు పోయారు.

– ఏ.రామాంజులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాయచోటి

దుకాణాలు బోసిపోతున్నాయి



గత సంవత్సరంలో ఫ్యాన్సీ స్టోర్లు రాయచోటి పట్టణంలో వినియోగదారులతో కళకళలాడుతుండేవి. నేడు ఆ పరిస్థితి లేదు. ఫ్యాన్సీ ఐటమ్స్ అడిగేనాథుడే లేకుండా పోయారు. మా దుకాణాలే కాకుండా పలు రకాల దుకాణాల పరిస్థితి రాయచోటిలో ఇలాగే ఉంది. వినియోగదారులు లేక దుకాణాలు బోసిపోతున్నాయి.

– గోపాల్‌దేవ్, శ్రీ శక్తి ఫ్యాన్సీ స్టోర్, బ్రాహ్మణవీధి, రాయచోటి

చెత్త సేకరణ వంద శాతం జరగాలి

రాయచోటి టౌన్ : పట్టణంలోని అన్ని వార్డులలో చెత్త సేకరణ వంద శాతం జరగాలని రాయచోటి మున్సిపల్ కమిషనర్ జి.రవికుమార్ శానిటేషన్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ సిబ్బంది, ఇతర అధికారులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ తప్పకుండా సేకరించాలని చెప్పారు. అలాగే పట్టణంలోని ప్రధాన మురుగు కాల్వలలో 15 రోజులకు ఒక సారి శుభ్రం చేయాలని చెప్పారు. ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మురుగునీరు నిలిచే ప్రదేశాలను శుభ్రం చేయాలని సూచించారు. రాయచోటి పట్టణాన్ని ఆరోగ్యకరమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు.

తలముడిపి శివాలయం స్థల సమస్యను పరిష్కరిస్తాం

గాలివీడు : తలముడిపి శివాలయం స్థల సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ భాగ్యలత, సీఐ కొండారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ భాగ్యలత, సీఐ కొండారెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ సమక్షంలో ఇరువర్గాలను పిలిపించి చర్చించారు. వినాయక చవితి పర్వదినం అనంతరం సమస్యను పరిష్కరిస్తామని, అంతవరకు ఇరువర్గాలు సంయమనం పాటించాలని సూచించారు. ఇదే విషయమై బాధితులు ఇటీవల కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించి న్యాయం చేయాలని కోరడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాలతో భేటి జరిపినట్లుగా సమాచారం. ఇదిలా వుండగా తలముడిపి పాపాగ్ని నదీ తీరాన సర్వే నంబర్ 533/1లో 5.24 ఎకరాల భూమి ఉండగా, అందులో అత్యంత పురాతన శివలింగం, భ్రమరాంబిక ఆలయాలు కొలువై ఉన్నాయని, అయితే అదే చోట తమకు డీకేటీ పట్టా ఇచ్చారని కొందరు అడ్డుతగలడంతో ఈ వివాదం తలెత్తినట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లె గ్రామంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందించే సబ్సిడీల గురించి వివరించారు. ఆయిల్ పామ్ తక్కువ ఖర్చు, తక్కువ కూలీలతో సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చునని రైతులకు వివరించామన్నారు. ఉద్యాన శాఖ వారు ఒక హెక్టార్‌కు రూ. 29,000 విలువ చేసే ఆయిల్ పామ్ మొక్కలు ఉచితంగా అందజేస్తారన్నారు. ఒక హెక్టార్‌కు ఒక సంవత్సరానికి ఎరువులు, పురుగుల మందుల యాజమాన్యానికి రూ. 5250, అంతర పంటలు వేస్తే రూ. 5250 రాయితీ ఇస్తారని చెప్పారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 10 హెక్టార్‌ల వరకు వర్తిస్తుందన్నారు. అలాగే పెద్దపల్లి గ్రామంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి ప్రభాకర్‌రెడ్డి, రియా ఆగ్రో అధికారి పవన్, ఏరియా మేనేజర్ హరీష్, వీహెచ్‌ఏ, వీఏఏ, ఫీల్డ్ ఆఫీసర్‌లు, రైతులు పాల్గొన్నారు.

సిద్దవటం కోట అభివృద్ధికి చర్యలు

కడప సెవెన్‌రోడ్స్ : సిద్దవటం కోట అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దక్షిణ భారత పర్యాటక సంస్థ గౌరవాధ్యక్షుడు ఎస్.భారవి, అధ్యక్షుడు జ్యోతి జార్జి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు కోరారు. కడప నగరం ఎర్రముక్కపల్లెలోని ఆ సంస్థ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడారు. పూర్వం సిద్ధులు వట వృక్షాల కింద తపస్సు చేసినందువల్లే ఈ ప్రాంతానికి సిద్దవటం అనే పేరు వచ్చిందన్నారు. వందల ఏళ్ల చారిత్రక వైభవం కలిగిన ప్రాంతమని, ఉదయగిరి సామంతరాజులు, మట్లిరాజులు, నవాబులు, ఆంగ్లేయులు ఈ కోట నుంచి పాలన చేశారన్నారు. తొలుత సిద్దవటమే జిల్లా కేంద్రంగా ఉండేదని, పాలకుల నిర్లక్ష్యంతో ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోటలో ఎత్తయిన శివలింగానికి రక్షణ ఏర్పాటుచేయాలని, ముళ్ల పొదలు తొలగించి శుభ్రపరచాలన్నారు. పెన్నా తీరం ఒడ్డున వెలిసిన జ్యోతి సిద్దవటేశ్వరస్వామి ఆలయానిన్ని ఆధ్యాత్మిక ప్రదేశంగా తీర్చిదిద్దాలని కోరారు. జ్యోతిశ్వరస్వామికి రాణి రుద్రమదేవి బహూకరించిన వెండి తేరు, వజ్రాల కిరీటంపై పరిశోధన జరపాలన్నారు.

ప్రతి మహిళా వ్యాపారవేత్తగా ఎదగాలి


మాట్లాడుతున్న పెనగలూరు ఎస్‌బీఐ మేనేజర్ సురేష్

పెనగలూరు : సంఘంలోని ప్రతి మహిళా సభ్యురాలు వ్యాపారవేత్తగా ఎదగాలని ఏపీఎం నిరంజన్ అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలలయంలో రుణ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలోని సభ్యులు బ్యాంకు రుణాలు తీసుకొని వ్యాపారవేత్తగా ఎదిగేందుకు ఇది ఒక మంచి అవకాశమని వారు తెలిపారు. అలాగే సంఘంలోని సభ్యులు రుణాలు తీసుకునేటప్పుడు గతంలో తీసుకున్న రుణాలు పూర్తిగా చెల్లించకపోయినా ఎనభై శాతం వరకు చెల్లించిన వారికి కొత్త రుణాలు మంజూరు చేయించడం జరుగుతుందని చెప్పారు. అంతకుముందు ఎస్‌బీఐ మేనేజర్ సురేష్ మాట్లాడుతూ తమ బ్యాంకు పరిధిలో ఉన్న సంఘాలకు ఎంత రుణాలు అవసరమో ముందుగానే దరఖాస్తులు తెలియజేయాలన్నారు. వ్యాపారానికి రుణాలు ఇస్తామన్నారు. సీఎంఈజీపీ ముద్ర, ఎంఐఎంఈ లోన్లు ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. అనంతరం రాజంపేట ఏడీబీ మేనేజర్ నరసింహులు మాట్లాడుతూ తమ బ్యాంకు పరిధిలో ఉన్న సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ యశ్వంత్ మహిళా సంఘాల ఉద్దేశం, సమావేశాల ప్రాధాన్యత, రికార్డుల నిర్వహణపై పలు సూచనలు చేశారు.

మూల్యాంకన పుస్తకాల విధానం మార్చాలి

రాయచోటి టౌన్ : విద్యార్థులకు మూల్యాంకన పుస్తకాలు సరఫరా చేసే విధానాన్ని ప్రభుత్వం మార్చాలని ఏపీటీఎఫ్ అధ్యక్షులు హరిబాబు కోరారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూల్యాంకన పుస్తకాలు విద్యార్థులకు సరఫరా చేసే విధానం వలన అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. దీని వలన పాఠశాల సమయం వృథా అవుతోందని తెలిపారు. ఈ పద్ధతి వలన బోధన సమయం పూర్తిగా వృథా అవుతుందని కావడంతో పాటు బోధన గంటలు అంతరాయం అవుతుందని తెలిపారు. మార్కుల నమోదు కూడా ఉపాధ్యాయులకు పని భారంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో బీలు నాయక్, గిరిబాబు, మహమ్మద్ ఆలీ, వేణుగోపాల్, శంభుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వర్కర్లకు వేతనాలు చెల్లించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రాజంపేట : మున్సిపల్ ఆఫీసులో పనిచేసినటువంటి బదిలీ వర్కర్లకు మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదని, కావున వెంటనే వేతనాలు చెల్లించాలని శుక్రవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి బదిలీ వర్కర్లుగా పనిచేసినటువంటి ముప్పై మంది కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని, కావున వెంటనే వేతనాలు చెల్లించాలని సబ్ కలెక్టర్ భావనకు వినతిపత్రం అందజేయగా సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి కమిషనర్‌తో మాట్లాడి జీతాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పీవీ రమణ, లక్ష్మీదేవి, ప్రసాదు, ఎం.రమణ, బాలాజీ, కోనయ్య, సీహెచ్ నరసింహులు, రమేష్ బాబు, కిరణ్ పాల్గొన్నారు.

పరామర్శ


షరీఫ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రమేష్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన మహమ్మద్ షరీఫ్ కుటుంబాన్ని శుక్రవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డప్పగారి రమేష్‌కుమార్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. మహ్మద్ షరీఫ్ మృతికి గల కారణాలను ఆరా తీశారు. షరీఫ్ మృతి చెందడం బాధాకరమని, కుమారుడు మహ్మద్ ఆలీని ధైర్యంగా ఉండాలని సూచించారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం


డంపింగ్ యార్డుకు విషయమై అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి

సిద్దవటం : మండలంలోని నేకనాపురం గ్రామ పంచాయతీకి చెందిన డంపింగ్ యార్డుకు మాధవరం-1కు చెందిన రైతు కంచె వేశారని, అధికారులు దాన్ని ఎందుకు తొలగించలేదని మండల సమావేశంలో బొగ్గిడివారిపల్లె ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సభా భవనంలో శుక్రవారం ఎంపీపీ వెంకటమ్మ అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ డంపింగ్ యార్డుకు అధికారులు మార్కింగ్ ఇచ్చేటప్పుడు ఎక్కడ ఇస్తున్నామో అనేది తెలియదా అన్నారు. డంపింగ్ కట్టేటప్పుడు అభ్యంతరం తెలపలేదు, తీరా డంపింగ్ యార్డు కట్టిన తరువాత నా పొలంలో కట్టారని సంబంధిత రైతు కంచె వేసుకున్నారు. ఈ విషయమై తహసీల్దారు అడుగుదామనుకుంటే గత సమావేశానికి రాలేదు, ఇప్పుడు సమావేశానికి రాలేదన్నారు. అధికారులే రానప్పుడు సమావేశం ఎందుకు జరపాలని ఎంపీడీఓ ఫణిరాజకుమారిని ఎంపీటీసీ నిలదీశారు. మాధవరం-1 ఎంపీటీసీ శివయ్య ఇచ్చిన వర్క్ ఆర్డర్‌ను మినిట్స్‌లో ఎందుకు పేర్కొనలేదని ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. డబ్బులు లేవని పెట్టలేదని ఎంపీడీఓ తెలపడంతో మినిట్స్‌లో ఎక్కిస్తే డబ్బులు ఉన్నప్పుడే పనులు జరుగుతాయని ఆయన అన్నారు. అంతేగాకుండా స్వాతంత్ర్య దినోత్సవం రోజు జాతీయ పతాకాన్ని ఎగుర వేసేందుకు ఎంపీటీసీకి సమాచారం ఇవ్వలేదని చంద్రశేఖర్‌రెడ్డి అధికారులపై శివాలెత్తారు. పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మట్లాడుతూ వాతావరణంలో మార్పులు రావడం వల్ల సీజనల్ వ్యాధులు ఆరవడం సహజమైనన్నారు. దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించు కోవాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి వ్యాధులు దగ్గరికి రావన్నారు. అపరిశుభ్రంగా ఉన్నప్పుడే జ్వరాలు, దగ్గులు వంటివి వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని ఆయన తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్ మాట్లాడుతూ కొన్ని గ్రామాలకు తాగు నీరు అందడం లేదని అందుకుగాను జెడ్పీ నిధులు రూ. 60లక్షలతో పైప్‌లైన్ పనులకు టెండర్లు పిలిచామన్నారు. టెండర్లు అయిపోయిన తరువాత పనులు ప్రారంభించి ప్రతి ఒక్కరికీ తాగునీరు అందిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షులు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, మేరువ మల్లేశ్వరి, ఎంపీటీసీలు శివయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, సర్పంచ్‌లు, ఎంపీడీఓ ఫణిరాజకుమారి, ఈఓపీఆర్‌డి మోహతాబ్ యాస్మిన్, వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, పి.కొత్తపల్లె వైద్యధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఉపాధి ఏపీఎం నరసింహులు, ఐసీడీఎస్ ఏసీడీపీఓ శోభారాణి సూపర్‌వైజర్లు శ్రీవిద్య, వెంకటలక్ష్మి, పీఆర్ ఏఈ నాగరాజు, హౌసింగ్ ఏఈ చెన్నయ్య, వెలుగు ఏపీఎం సుజాత, మరికొందరు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'వెలిగల్లు'లో నిమజ్జనం నిషేధం

గాలివీడు : వెలిగల్లు జలాశయంలో వినాయక విగ్రహాల నిమజ్జనం నిషేధించినట్టు ఎస్‌ఐ రామకృష్ణ, ప్రాజెక్ట్ ఏఈ సాంబశివుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలిగల్లు ప్రాజెక్ట్ శుద్ధి జలాలను రాయచోటి, గాలివీడు ప్రాంతాలకు తాగునీటి కోసం వినియోగిస్తున్నందున నిమజ్జనాన్ని నిషేధించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

నీటి సమస్యను పరిష్కరించండి

రాయచోటి జగదాంబసెంటర్ : మండల పరిధిలోని పాత సైకంవారిపల్లెలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డీఆర్‌ఓ మధుసూదన్‌రావుకు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ 15 సంవత్సరాల కిందట పాత సైకంవారిపల్లెలో స్కీంబోరు వేశారని, అయితే సంవత్సరం నుండి వాటర్ రాలేదని వాపోయారు. నీటిసమస్యతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారని అధికారులు స్పందించాలని కోరారు.

సదుపాయాలు కల్పించండి

ఒంటిమిట్ట : కోదండరామస్వామి ఆలయంలో కళాకారులకు సదుపాయాలు కల్పించాలని, అలాగే బస్సు చార్జీలు చెల్లించాలని, బస చేసేందుకు రూము ఏర్పాటు చేయాలని శుక్రవారం మధ్యాహ్నం టీటీడీ డిప్యూటీ ఈఓ ప్రశాంతికి జిల్లా కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు సాంబశివ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కళాకారులు వెంకట సుబ్బయ్య, నాగయ్య, యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

రాయచోటి టౌన్ : విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ రూల్స్ పాటించడం, వాటిపై అవగాహన పెంచుకోవడం నేర్చుకోవాలని రాయచోటి ట్రాఫిక్ సీఐ కుళ్లాయప్ప తెలిపారు. శుక్రవారం రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని చెప్పారు. హెల్మెట్ లేని కారణంగా అనేక మంది తమ ప్రాణాలను కోల్పోయారని తెలియజేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

రాయచోటి టౌన్ : సుఖ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. శుక్రవారం రాయచోటి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చాటిన ముగ్గురు విద్యార్థులకు విద్యార్థులకు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే రేషన్ ఇవ్వాలి

లక్కిరెడ్డిపల్లి : వృద్ధులు, దివ్యాంగులకు నిర్ణీత సమయంలోపు రేషన్ ఇంటి వద్దకే వెళ్లి అందించాలని లక్కిరెడ్డిపల్లి తహసీల్దార్ క్రాంతి కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని వృద్ధులు, వికలాంగులకు ప్రతినెల 31వ తేదీలోపు వారి ఇంటి వద్దకే వెళ్లి వేలిముద్రలు వేయించుకుని బియ్యం అందించాలన్నారు. ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టి లక్కిరెడ్డిపల్లి మండలాన్ని జిల్లాలో మొదటిస్థానంలో నిలిపేందుకు ప్రతి డీలర్ సహకరించాలన్నారు. అనంతరం రేషన్ డీలర్లు మాట్లాడుతూ తమకు నాలుగు సంవత్సరాలుగా ఆథరైజేషన్‌లు రెన్యువల్ చేయడం లేదని, తాము చలానాలు చెల్లించినా ఆథరైజేషన్‌లు అందించడం లేదని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కార్యాలయ సిబ్బందితో మాట్లాడి ఆథరైజేషన్లు అందించేలా చూస్తామని తెలిపారు. స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు స్టాక్ బోర్డులో నమోదు చేస్తూ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కొంతమంది డీలర్లు గతంలో ఉన్న స్టాక్‌లోని వ్యత్యాసాలను సరి చేసుకోవాలని లేనిపక్షంలో ఎవరైనా తనిఖీలు చేపడితే బాధ్యులు రేషన్ డీలర్లే అవుతారని వారు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న, ఆర్‌ఐ రాజేష్, రేషన్ డీలర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు మొబైల్‌కు బానిస కాకూడదు

పెనగలూరు : చక్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెనగలూరు ఎస్‌ఐ బి.రవిప్రకాష్ రెడ్డి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు గోపాలకృష్ణ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మొబైల్ ఫోన్‌ను అనవసరంగా ఉపయోగించరాదని, అశ్లీల వెబ్‌సైట్లు ఓపెన్ చేయకూడదని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. క్రమశిక్షణ, సత్ప్రవర్తన కలిగి ఉంటే చదువులో విజయావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. పాఠశాలకు రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

మామిడిలో డ్రిప్ పద్ధతి ఏర్పాటు చేసుకోవాలి

సుండుపల్లె : మండల పరిధిలోని ఈడిగపల్లి గ్రామ సచివాలయంలో రైతులు మామిడి కోత అనంతరం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై ఉద్యాన శాఖ అధికారి వనిత, శాస్త్రవేత్తలు కలిసి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి తోటల్లో కోత తర్వాత ఏడు నుండి పది రోజులు చెట్లకు విశ్రాంతినివ్వాలని అనంతరం కొమ్మల కత్తిరింపు తప్పనిసరిగా చేయాలని సూచించారు. కత్తింపు తర్వాత చెట్ల వయస్సును బట్టి ఎరువులు వేయాలని, ప్రతి మామిడి రైతు డ్రిప్పు పద్ధతిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 10 సంవత్సరాలు పైబడిన చెట్లకు యూరియా 1 కేజీ, సూపర్ పాస్పేట్ 5 కేజీలు, పొటాష్ 750 గ్రాముల మోతాదులో ఒక్కొక్క చెట్టుకు నాలుగు అడుగుల దూరంలో చెరువులను వేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త రేణుక ప్రసాద్‌రెడ్డి, మండలంలోని రైతులు పాల్గొన్నారు.

మామిడిలో కొమ్మలు కత్తిరింపులు చేపట్టండి

ఓబులవారిపల్లె : మామిడి రైతులు కొమ్మల కత్తిరింపు చేపట్టాలని ఉద్యానశాఖ శాస్త్రవేత్త స్వామి శేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం పెద్దఓరంపాడు రైతు సేవా కేంద్రంలో మామిడి రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి కొమ్మలు కత్తిరింపు ఆవశ్యకతను, కత్తిరింపు చేసే విధానాలు, కలుపు యాజమాన్య పద్ధతులను వివరించారు. తప్పనిసరిగా సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలని తద్వారా ఆరోగ్యకరమైన మొక్కలు పెరిగి నాణ్యమైన దిగుబడి సాధించవచ్చన్నారు. ఉద్యానశాఖ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ఈ సమయంలో అధికంగా వచే ఆకు జల్లెడ గూడు పురుగు, కాండం తొలుచు పురుగుల నియంత్రణ చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో సువన్ ఆగ్రో ఇండస్ట్రీస్ సిబ్బంది కొండారెడ్డి, లక్ష్మీ ప్రసన్న, ఉద్యాన వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు


పోలీసులు అదుపులో నిందితుడు, బంగారు

పుల్లంపేట : మండలంలోని రెడ్డిపల్లి క్రాస్ వద్ద పుల్లారెడ్డిపల్లెకు చెందిన పి.చరణ్ కుమార్ (26) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి రూ. 5 లక్షలు విలువచేసే ఒక బంగారు నెక్లెస్, చైను, డాలర్, బుట్టకమ్మలు, చిన్న బంగారు కమ్మలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు రాజంపేట సీఐ రమణ, పుల్లంపేట ఎస్‌ఐ శివకుమార్‌లు తెలిపారు.